ఆర్టీసీ వారు.. పాత బస్టాండ్‌ను పట్టించుకోరు!

- పాత బస్టాండ్‌కు రాని జంగారెడ్డిగూడెం బస్సులు
- ఇబ్బందులు పడుతున్న చింతలపూడి ప్రయాణికులు
- నిరుపయోగంగా మినీ బస్టాండ్


బస్సులు రాక నిరుపయోగంగా ఉన్న చింతలపూడి పాత బస్టాండ్ సమీపంలో నిర్మించిన మినీ బస్టాండ్

చింతలపూడి: జంగారెడ్డిగూడెం బస్సెక్కాలంటే చింతలపూడి ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు అన్నీ, ఇన్నీ కావు. బోయగూడెం సమీపంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించడంతో చాలా ఏళ్లుగా జంగారెడ్డిగూడెం డిపో బస్సులు చింతలపూడి పాత బస్టాండ్‌కు రావడం లేదు. పట్టణంలోని పాత బస్టాండ్‌కు కొత్త బస్టాండ్‌కు మధ్య దూరం సుమారు రెండు కిలో మీటర్లు ఉంటుంది. పాత బస్టాండ్‌కు బస్సులు నడపకపోవడంతో కొత్త బస్టాండ్ నుంచి వచ్చేందుకు ప్రయాణికులు ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రయాణికులు పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్‌కు వెళ్లాలన్నా, రావాలన్నా రానూ, పోనూ రూ.30 ఖర్చు అవుతున్నట్లు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో అయితే జంగారెడ్డిగూడెం నుంచి వచ్చే బస్సు ప్రయాణికులు పడే ఇబ్బందులు చెప్పలేం. ఆ సమయంలో బస్టాండ్ నుంచి పట్టణంలోకి రావడానికి ఆటోలు కాని ఇతర వాహనాలు కాని ఉండవు. దీంతో పాత బస్టాండ్ వరకు బస్సులు నడపాలని ప్రయాణికులు ఎంత మొత్తుకుంటున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎప్పటినుంచో ఈ సమస్యను పరిష్కరించమని పట్టణ ప్రజలు కోరుతున్నా అధికారులు కాని, ప్రజాప్రతినిధులు కాని స్పందించడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి జంగారెడ్డిగూడెం బస్సులు పాత బస్టాండ్ వరకూ నడిపేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. రూ.20 లక్షల వ్యయంతో పాత బస్టాండ్ సమీపంలో చాలా కాలం క్రితం మినీ బస్టాండ్‌ను నిర్మించారు. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరింది. మినీ బస్టాండ్‌ను అభివృద్ధిపరిచి అన్ని డిపోల బస్సులు మినీ బస్టాండ్‌కు వచ్చి వెళ్లేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అన్ని డిపోల బస్సులూ నడపాలి



పాత బస్టాండ్‌కు అన్ని డిపోల బస్సులు వచ్చి వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా జంగారెడ్డిగూడెం వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. పాత బస్టాండ్ సెంటర్ నుంచి కొత్త బస్టాండ్ వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

– ఎస్‌కే కాలేష, చింతలపూడి

ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి



ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను వెంటనే తీర్చాలి. మొహిద్దీన్‌కుంట చెరువు వద్ద నిర్మించిన మినీ బస్టాండ్‌ను వెంటనే ప్రారంభించాలి. మినీ బస్టాండ్‌లో మరుగుదొడ్లను నిర్మించాలి. జంగారెడ్డిగూడెం డిపో బస్సులు మినీ బస్టాండ్ వరకు నడపాలి.

– దొంతా కృష్ణ, రేచర్ల, చింతలపూడి మండలం

క్షేత్రంలో 'సంక్రాంతి అతిథుల' సందడి

శ్రీవారి దివ్య క్షేత్రంలో సంక్రాంతి అతిథులు సందడి చేస్తున్నారు. దూడూ బసవన్నల విన్యాసాలు, జంగమ దేవరుల శంఖారావాలు పురవీధుల్లో మార్మోగుతున్నాయి. తెల్లవారుజాము నుంచే ఇంటింటికి తిరుగుతూ సంక్రాంతి వైభవాన్ని చాటుతున్నారు. కొండపైన జంట గోపురాల ప్రాంతంలో హరిదాసు తలపై అక్షయ పాత్ర ధరించి, చేతిలో చిడతలు పట్టుకుని సందడి చేస్తున్నాడు. అలాగే నిత్యం శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవి తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగితూ, భక్తులను కటాక్షిస్తున్నారు. మొత్తం మీద సంక్రాంతి అతిథులు, స్వామివారి గ్రామోత్సవాలతో క్షేత్రంలో పండుగ వాతావరణం సంతరించుకుంది.

– ద్వారకాతిరుమల


శ్రీవారి క్షేత్రంలో హరిదాసు సందడి


ద్వారకాతిరుమలలో ఇంటింటికి వెళుతున్న దూడూ బసవన్న


శ్రీవారి తిరువీధి సేవ


ద్వారకాతిరుమలలో జంగమదేవరలు

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థి ఎంపిక


కొవ్వలిలో విద్యార్థికి మొమెంటో, ప్రశంసా పత్రం అందజేస్తున్న డీఈవో

కామవరపుకోట: రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు తడికలపూడిలోని జెడ్పీ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి సాజిత్ గని ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంగులూరి సర్వేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం దెందులూరు మండలం కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థి సాజిత్ గని రూపొందించిన ×విద్యార్థి హాజరు€ యాప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై ందన్నారు. ఈ యాప్ ద్వారా విద్యార్థి బడికి రాకున్నా, వచ్చి మధ్యలో వెళ్లిపోయిన వెంటనే తల్లిదండ్రులకు సందేశం వెళుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సాజిత్‌కు డీఈవో వెంకట లక్ష్మమ్మ మొమెంటో ప్రశంసా పత్రం అందజేయగా, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

యర్రగుంటపల్లిలో ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చింతలపూడి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, వింకా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో యర్రగుంటపల్లిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ తుల్లిమిల్లి రాణి, మాజీ జెడ్పీటీసీ తాళ్లూరి రాధారాణి ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్ రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. వింకా హాస్పిటల్ వైద్యులు దుర్గా ప్రసాద్, అచ్యుత్, దీప్తి, ప్రభ, సిబ్బంది వైద్య సేవలందించారు. మానవత చింతలపూడి శాఖ జిల్లా సహాయ కార్యదర్శి పుల్లూరి సోమ శేఖరాచార్యులు, అధ్యక్షుడు కనమతరెడ్డి రాజేశ్వరి, చైర్మన్ ఆర్నేపల్లి అప్పారావు, కన్వీనర్ కాంగ్రేగుల నాగ చిన్నారావు, పులిపాటి కిషోర్, నిమ్మగడ్డ అశోక్ బాబు తదితరులు రోగులకు సేవలు అందించారు.

శెట్టిబలిజ యువత రాజకీయాల్లో రాణించాలి

బుట్టాయగూడెం: శెట్టిబలిజ యువత రాజకీయంగా ఎదిగినప్పుడే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ సంఘ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నాయకులు పంపన అంజిబాబు, శెట్టిబలిజ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, నాయకుడు బత్తెన చిన్నా అన్నారు. మండలంలోని సింగారంపాడు సమీపంలో నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనం వద్ద ఆదివారం ఏజెన్సీ శెట్టిబలిజ యువజన సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘ మండల నాయకులు గుబ్బల సత్యంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. శెట్టిబలిజ యువకులు ఐక్యతతో ముందుకు సాగుతూ సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలకు అనుగుణంగా శెట్టిబలిజ యువకులు, నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పిల్లి అరవలరాజు, సమ్మంగి సత్యనారాయణ, యాండ్ర వెంకటేశ్వరరావు, దుంగా శివ, చింతలపూడి, పోలవరం, తణుకు నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు చెందిన శెట్టిబలిజ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామకోటి సప్తాహ మహోత్సవాలు


సంకీర్తన నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: లక్కవరం రామాలయంలో 96వ శ్రీరామకోటి సప్తాహ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 4వ తేదీన ఈ కార్యక్రమాలు ప్రారంభం కాగా, 10వ తేదీ వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం ఆలయంలో హరిదాస స్వరార్చన కార్యక్రమం నిర్వహించారు. దాస సాహిత్య ప్రాజెక్టు టీటీడీ ప్రతినిధి చుండూరు పరమేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నర్సీపట్నం సంకీర్తన భజన మండలి వారిచే స్వరార్చన నిర్వహించగా, డా.శిరీష శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పూజా కార్యక్రమాలకు టీవీబీఏవీ రామతారకం, రమాకుమారి దంపతులు ద్రవ్య సహాయం అందించారన్నారు.

హైందవ శంఖారావానికి తరలిన నేతలు


హైందవ శంఖారావానికి తరలివెళుతున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

బుట్టాయగూడెం: దేవాలయాల స్వయం ప్రతిపత్తి పోరాటానికి ప్రతి హిందువూ సైనికుడు కావాలని బీజేపీ పోలవరం నియోజకవర్గం నాయకులు కొండేపాటి రామకృష్ణ అన్నారు. విజయవాడలో ఆదివారం ఏర్పాటు చేసిన హైందవ శంఖారావానికి ఏజెన్సీప్రాంతం నుంచి భారీ ఎత్తున హిందువులు తరలివెళ్లారు.

జంగారెడ్డిగూడెం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావానికి జంగారెడ్డిగూడెం పట్టణం, మండలం నుంచి భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సుమారు 20 బస్సులు, వ్యక్తిగత వాహనాల ద్వారా సుమారు 3వేల మంది తరలి వెళ్లారు.

కొయ్యలగూడెం: హైందవ శంఖారావానికి మండలం నుండి పలు గ్రామాల ప్రజలు ఆదివారం భారీగా తరలి వెళ్లారు హైందవ ఆలయాలను ప్రభుత్వ అజమాయిషి నుంచి మినహాయించి స్వయం ప్రతిపత్తి కల్పించాలన్నదే హైందవ శంఖారావ ముఖ్య ఉద్దేశం అని పురోహిత సమాఖ్య పిలుపునిచ్చింది. రాజవరం, బయ్యన్నగూడెం, రామానుజపురం, కన్నాపురం, దిప్పకాయలపాడు, అచ్యుతాపురం, పొంగుటూరు, అంకాలగూడెం తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున హిందువులు తరలి వెళ్లారు.

ద్వారకాతిరుమల: విజయవాడలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావం భారీ బహిరంగ సభకు మండలం నుంచి పెద్ద ఎత్తున హిందువులు తరలివెళ్లారు. పలు గ్రామాల్లో ముందుగా హిందువులు ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా విజయవాడకు బయల్దేరి వెళ్లారు.

ముంపు గ్రామాల నిర్వాసితులకు న్యాయం చేయాలి

కుక్కునూరు: కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ముంపు గ్రామాలన్నింటిని యూనిట్‌గా తీసుకోని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం ఏఐయూకేఎస్ రాష్ట్ర నాయకుడు షేక్ గౌస్ డిమాండ్ చేశారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ ఏఐయూకేఎస్ ఆల్ ఇండియా కమిటీ ఈ నెల 9వ తేదీన ఏలూరు కలెక్టరేట్ ముందు చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మండలంలోని నెమలిపేట గ్రామంలో కరపత్రాలను విడదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 2017 జీఓను రద్దుచేసి కొత్త జీఓ ఇచ్చి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, రైతు పంటలకు ఎంఎస్‌పీని చట్టబద్ధం చేయాలని, 2006 అటవీ హక్కుల రక్షణ చట్టం ప్రకారం పోడుభూముల సాగుదారులందరికి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలివ్వాలని, గుమ్మడివెల్లి పెద్దవాగు ప్రాజెక్ట్ కరకట్ట గండి నిర్మాణం కుడి, ఎడమ ప్రధాన కాలువలు మరమ్మతులు చేయాలన్న డిమాండ్లతో ధర్నా చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఐకేయూఎస్ నాయకులు సిరికొండ రామారావు, గడ్డాల ముత్యాలరావు, బి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టం వీరస్వామి, జిల్లా నాయకులు సోయం చంద్రావు, కట్టం ముత్యాలరావు, కంగాల కల్లయ్య, పీఓడబ్ల్యూ నాయకురాలు షేక్ మున్ని, మచ్చా లక్ష్మయ్య, మంగయ్య, మహేష్, దేశయ్య, బొజ్జి, రమేష్ పాల్గొన్నారు.

మాజీ హోం మంత్రి వనిత పరామర్శ


దండియ్యకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వనిత, పార్టీ నేతలు

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడుకు చెందిన దివంగత మాజీ జెడ్పీటీసీ బుసనబోయిన సత్యన్నారాయణ తండ్రి దండియ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా బుసనబోయిన కుటుంబాన్ని మాజీ హోం మంత్రి తానేటి వనిత ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్ తదితరులతో కలసి ఆమె దండియ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అంతక ముందు సాయన్నపాలెంలో వైఎస్సార్ సీపీ నేత బసివిరెడ్డి వెంకట్రామయ్య కుటుంబాన్ని వనిత పరామర్శించారు. ఇటీవల వెంకట్రామయ్య తండ్రి చంద్రయ్య మృతి చెందగా, ఆయన చిత్రపటానికి వనిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు యాచమనేని నాగేశ్వరరావు, చెలికాని బుల్లియ్య, దాకారపు బంగారమ్మ, షేక్ భాషా, మల్లెపూడి నాగమణి, కామిరెడ్డి శ్రీను, దాసరి రాంబాబు, పోల్కంపల్లి అనీల్ బాబు, మానుకొండ సుబ్బారావు, మానుకొండ పండు, దిర్శిపాం అన్నవరం, పొనమాల ఉమామహేశ్వరరావు, మానుకొండ ప్రసాద్ తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు కోరారు. మండలంలోని పాతూరులో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. పార్టీకి రానున్నవి మంచి రోజులని, గ్రామస్థాయి నుంచి ప్రతి కార్యకర్త పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, సొసైటీ మాజీ చైర్మన్ సాయిన కనకరాజు, జెడ్పీటీసీ కడిమి రమేష్, మండల కన్వీనర్లు మిడతా రమేష్, టౌన్ కన్వీనర్ నానాది సాగర్, ఎంపీటీసీలు మేడంకి పద్మ, పోలిమెట్ల ప్రశాంత్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, సిద్దిరాజు, జానీ, బాబురావు బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఆటో ఢీకొని గాయాలపాలైన బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన సిరిబత్తుల సత్యనారాయణ, పార్వతి భార్యాభర్తలు. వీరు తాపీ పని చేసుకుని జీవిస్తున్నారు. ఈ నెల 3వ తేదీన బొర్రంపాలెం మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా, పట్టణంలోని రామచంద్రాపురం వాటర్ ట్యాంక్ సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ఘటనలో పార్వతికి తీవ్ర గాయాలు కాగా, సత్యనారాయణకు స్వల్పగాయాలయ్యాయి. వారికి స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

అశోక్‌నగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానం


అశోక్‌నగర్‌లో రోడ్డుపైనే నిలిచిన డ్రెయినేజీ నీరు

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ పరిధిలోని అశోక్‌నగర్‌లో డ్రెయినేజీ నీరు నిలిచి అధ్వానంగా మారింది. చింతాలమ్మ గుడి మొదలు పాదాలమ్మ గుడి వరకు ఉన్న సీసీ రోడ్డులో ఓవైపు ఆక్రమణల వలన డ్రెయినేజీ నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోందని, దీనివల్ల మురుగునీరు సీసీ రోడ్డుపై ప్రవహించి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా నిర్మించిన సీసీ రోడ్లకు కూడా ఇదే విధమైన దుస్థితి ఏర్పడిందని, డ్రెయినేజీలు నిర్మాణం జరిగితేనే నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లకు మనుగడ ఉంటుందని అంటున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలకు గురైన డ్రెయినేజీలను, అదేవిధంగా టేకు తోట, మరికొన్నిచోట్ల నూతన డ్రెయినేజీలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏలూరులో ముగిసిన చెస్ ఫెస్టివల్

ఏలూరు రూరల్: ఏలూరు శాంతినగర్‌లో ఆదివారం అండర్–15 చెస్ ఫెస్టివల్ నిర్వహించామని అబ్రహం గ్యారీకాస్పారోవ్ చెస్ అకాడమీ డైరెక్టర్ జి యోహనాన్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పిపాల్ వుడ్ గ్లోబల్ స్కూల్ ఆవరణలో ఆర్బిటర్లు జి స్వరూపరాణి, పి యదిద్యా పరివేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో జి అభిషేక్ అబ్రహామ్ ప్రథమస్థానం, జి అనురూప్ మోషే రెండోస్థానం, పి హర్షవర్ధన్ మూడోస్థానంలో నిలిచారని వెల్లడించారు. వి.కార్తికేయ, పి.ఉదయ్‌కుమార్ సైతం నాలుగు, ఐదో స్థానం సాధించారని వివరించారు. వీరితో పాటు పి సాత్విక, కె మమిత్‌కుమార్, టి నేవనీత్, బి జస్వంత్, ఎస్‌కే పర్వాన్, బి ధరణి, ఎం అశ్విన్, ఎం బెన్ని, మోక్షిత్, ఆదర్స్ ప్రతిభ చాటారని పేర్కొన్నారు. విజేతలకు స్కూల్ ప్రతినిధులు ఎస్ బలరామ్, ఏఎస్ఎస్ మాధవ్, యలమంచిలి నాగేంద్ర శ్రీనివాస్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారని తెలపారు.

క్లుప్తంగా

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సంస్థ

కొయ్యలగూడెం: స్థానిక కొవ్వూరు రోడ్డులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కుటుంబానికి మానవత సంస్థ రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేసింది. ఈ సందర్భంగా మానవత సంస్థ అధ్యక్షుడు మాటూరి సుధీర్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా కొయ్యలగూడెంలో అగ్నిమాపక కేంద్రం నిర్మించాలని ప్రజలు కోరుతున్నా నెరవేరడం లేదని, దీనివల్ల అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా రావడంతో అనేక అగ్ని ప్రమాదాల్లో ఆస్తి, ప్రాణ నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వెంటనే కొయ్యలగూడెం కేంద్రంగా అగ్నిమాపక కేంద్రాన్ని నిర్మించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు


బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని ముద్దప్పగూడెం సమీపంలో ఆదివారం పోలవరం ఎక్సైజ్ అధికారులు నాటుసారా తయారీ కేంద్రాలపై దాడి చేశారు. ఈ దాడిలో నాటుసారా తయారీకి ఉపయోగించే 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తమకు అందిన సమాచారంతో ఈ దాడులు చేసినట్లు చెప్పారు. సబ్ ఇన్‌స్పెక్టర్ జి. సునీల్‌కుమార్, స్టేషన్ సిబ్బంది, తదితరులు ఈ దాడిలో పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం


దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. కృష్ణాజిల్లాకు చెందిన కోట శివ సందీప్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ డీవీఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఆగని మట్టి తవ్వకాలు


మెట్టగూడెం సమీపంలోని కాల్వలో మట్టిని తవ్వేసిన దృశ్యం

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలంలో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా మట్టి వ్యాపారులు జేసీబీతో మట్టిని తవ్వి ట్రాక్టర్లతో తరలిచేస్తున్నారు. సంబంధిత అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. బుట్టాయగూడెం మండలం మెట్టగూడెం, మర్రిగూడెం గ్రామాల మధ్య ఉన్న కాల్వ ప్రదేశంలో ఆదివారం ఇసుక, మట్టి కలిగిన ప్రదేశాన్ని కొందరు జేసీబీతో తవ్వి రవాణా చేశారు. రెండు రోజులుగా తవ్వుతున్నారని సమాచారం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సత్యదేవునికి లక్ష తులసి పూజ


సత్యనారాయణ స్వామికి లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: గవరవరంలో కొలువైన శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామికి ఆదివారం లక్ష తులసి పూజ నిర్వహించారు. అర్చకులు వాడపల్లి ప్రభాకర రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజలను జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణం జరిగి 93 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పోలవరం డివిజన్
90102 23729
95055 08399 (చింతలపూడి)
Office mail : tpgadvt@gmail.com